మిర్చి రైతు.. అప్పుల బాట

- తగ్గిన మిర్చి ధరలతో ఆందోళన
- పెరిగిన పెట్టుబడి బాకీల పాలు
- తెగుళ్ల బారిన పడి తగ్గుతున్న దిగుబడులు
- కూలీల రేట్లతో తప్పని ఇబ్బందులు
- గత ఏడాది ధర రూ.18,000
- ప్రస్తుత ధర 10 వేల రూపాయలు



వెనిగండ్లలో తెగులు సోకిన మిరప పైరు

పెదకాకాని: రైతులు నష్టాల బాట పడుతున్నారు. కోటి ఆశలతో ఈ ఏడాది రైతులు రెక్కలు ముక్కలు చేసుకుని మిర్చి పంట సాగు చేశారు. ప్రస్తుతం రోజురోజుకు మార్కెట్లో మిర్చి ధరలు పతనం కావడంతో వారు ఆందోళన చెందుతున్నారు. మొదటి నుంచి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోనే మిర్చి పంట సాగులో గుంటూరు జిల్లాకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. మండలంలోని పెదకాకాని, కొప్పురావూరు, వెనిగండ్ల, తక్కెళ్లపాడు తదితర గ్రామాల్లో రైతులు ఈ ఏడాది మిర్చి సాగు చేశారు.

పెట్టుబడి ఇలా..

ఈ ఏడాది మిర్చి 178.60 ఎకరాలలో సాగు చేశారు. సాగు పెట్టుబడి పెరిగింది. ప్రభుత్వ అంతంతమాత్రమే సాయం అందించింది. చీడపీడలు, దోమ, తెగుళ్ల నుంచి పంటను రక్షించుకోవడానికి రైతులు ఇష్టానుసారంగా రసాయనిక ఎరువుల వాడారు. పెట్టుబడి రెండింతలు పెరిగింది. మిరప మొక్క కొనుగోలు నుంచి నాటు వేసి కోత వరకు ఎకరానికి రూ.1,80,000 పెట్టుబడుల రూపంలో ఖర్చు చేశారు. తామర పురుగు దెబ్బకు ఎకరానికి 8 నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడులు తగ్గినట్లు రైతులు వాపోతున్నారు. గత ఏడాది క్వింటా మిర్చి రూ.18,000 పలికితే ఈ ఏడాది క్వింటా మిరప కాయలు రూ.10 వేలు అమ్మడానికి రెండు రోజులు మిర్చి యార్డుకు తిరగాల్సిన దుస్థితి.



పొలంలో ఆరబెట్టిన మిరపకాయలు

పెరిగిన కూలీల రేట్లు..

ఎకరం మిర్చి కోతకు రకం బట్టి ఏడుగురు నుంచి 10 మంది వరకు కూలీలు పడుతున్నారు. గ్రామాల్లో మిర్చి కోతలకు కూలీలు అందుబాటులో లేక పోవడంతో ఇతర గ్రామాల నుంచి కూడా మిరప కాయలు కోయడానికి వస్తున్నారు. గత ఏడాది రూ.300 ఉంటే రెండు మూడు రోజుల వరకు రోజు కూలీ రూ.400 ఉండగా ప్రస్తుతం రూ.450 నుంచి రూ.500 వరకు ఉంది. వీరికి ఆటో బాడుగ అదనంగా చెల్లించాలి.

కౌలు రైతుల పరిస్థితి దైన్యం..

మండలంలో 60 శాతం మంది కౌలు రైతులు మిర్చి సాగు చేస్తున్నారు. ప్రభుత్వ ఆర్థిక సాయం అందలేదు. దీంతో పాటు పెట్టుబడి పెరిగినప్పటికీ దిగుబడి తగ్గడం, మార్కెట్లో రోజురోజుకు ధరలు పతనం అవుతుండటంతో మిర్చి రైతన్నలు దిక్కుతోచకని స్థితిలో ఉండిపోతున్నారు. మిర్చి రకం బట్టి క్వింటాకు 11 వేల నుంచి నుంచి 13,500 రూపాయలు పలికిన ధరలు పడిపోవడంతో పెరిగిన పెట్టుబడులు, తగ్గిన దిగుబడులు పతనమవుతున్న మిర్చి ధరలకు తోడు పొలం కౌలు ధర చెల్లించడం అదనంగా మారింది. పంటను కాపాడుకునేందుకు బోరునీటిని ఒక్క తడికి 1500 రూపాయల చొప్పున కొనుగోలు చేస్తున్నట్లు పలువురు రైతులు చెబుతున్నారు.

రైతుకు నష్టాలు తప్పవు



ఈ ఏడాది మిర్చి రైతులకు నష్టాలు తప్పడం లేదు. పైరు కాపు దశలో ఉండగా నల్లి, తామర పురుగు, దోమ పైరును ఆశించడంతో దిగుబడులు బాగా తగ్గిపోయాయి. ప్రస్తుతం ఉన్న ధరకు మిరప కాయలు అమ్మితే గిట్టుబడి కాదు. ఎకరానికి 1.50 లక్షలు పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. ఇంత పెట్టుబడులు పెట్టినా లాభం లేకపోగా నష్టం వస్తుంది. రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

–కొండమడుగుల శ్రీనివాసరెడ్డి, మిరప రైతు, వెనిగండ్ల

ధరలు పడిపోయాయి..



మిరప కాయల ధరలు రోజు రోజుకూ పడిపోవడంతో ఎకరానికి 50 వేలు నష్టం. ఎకరం పొలం కౌలుకు తీసుకుని మిరప పంట సాగు చేశా. తీరా పంట పండే సమయానికి తెగుళ్లు ఆశించాయి. ఎన్ని మందులు పిచికారి చేసినా ముడత తగ్గలేదు. మిరప దిగుబడులు మాత్రం తగ్గిపోయాయి. కౌలుకు తీసుకుని మరీ సాగు చేశా. ప్రభుత్వమే గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలి.

–మైలా వెంకటేశ్వరరావు, మిరప రైతు

జూనియర్ కళాశాల విద్యార్థినుల విజయభేరి



నజ్మా(962) మార్కులు



పద్మావతి(437)



నాగసుహాసిని(386)

గుంటూరు రూరల్: ఇంటర్ ఫలితాల్లో అంకిరెడ్డి పాలెం ప్రభుత్వ కళాశాల విద్యార్థినులు విజయభేరిని మోగించారు. శనివారం విడుదలైన ఫలితాల్లో అంకిరెడ్డిపాలెం జూనియర్ కళాశాల విద్యార్థినిలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ బాలికల కళాశాలల జిల్లా స్థాయి ఉత్తీర్ణత శాతం కంటే మెరుగైన ఫలితాలు సాధించారు. సీనియర్ ఇంటర్ మీడియట్‌లో 80 శాతం, జూనియర్ ఇంటర్‌మీడియట్‌లో 75శాతం ఫలితాలను సాధించారని కళాశాల ప్రధానోపాధ్యాయురాలు సరోజిని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి ఉత్తమ ఫలితాలు సాధించేలా కమిటీ సభ్యులు సంజీవరెడ్డి, వీరగంగాధరరెడ్డి కృషి ఎంతో ఉందని చెప్పారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి నిరంతర సహకారానికి ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో అత్యధికంగా ఎంపీసీలో కోమలి 868 మార్కులు, బైపీసీలో శిరీష 730 మార్కులు సాధించారన్నారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో పద్మావతి 437, బైపీసీలో నాగహాసిని 386 మార్కులు సాధించి మంచి ప్రతిభ కనబరిచారన్నారు. అదే విధంగా ఫెయిల్ అయిన విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని, వారందరూ ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామని అకడమిక్ అడ్మినిస్ట్రేటర్ గంగాధరరెడ్డి తెలిపారు. సప్లిమెంటరీ విద్యార్థులకు మెరుగైన శిక్షణ ఇచ్చేందుకు వీలుగా కార్పొరేట్ స్థాయి కార్యాచరణ రూపొందించామని కళాశాల విద్యార్థినిలకే కాకుండా ఇతర కళాశాలలకు చెందిన విద్యార్థులకు కూడా శిక్షణ ఇస్తామని అకడమిక్ డైరెక్టర్ సంజీవరెడ్డి తెలిపారు.

ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయం

పెదకాకాని: ఇంటర్మీడియెట్‌లో స్థానిక బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమని హెచ్‌ఎం నంబూరు తిరుపతిరావు తెలిపారు. రెండేళ్ళ క్రితం పెదకాకాని మండలంలోని వెనిగండ్ల గ్రామానికి ప్రభుత్వం బాలికల జూనియర్ కళాశాల మంజూరు చేసిన సంగతి విదితమే. ప్రభుత్వం శనివారం ప్రకటించిన ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో జిల్లా పరిషత్ పాఠశాల వెనిగండ్ల నుంచి ద్వితీయ సంవత్సరం విద్యార్థిని మహమ్మద్ కరిమున్నీసా 1,000 మార్కులకు గాను 937 మార్కులు, ప్రథమ సంవత్సరం పరీక్ష ఫలితాల్లో షేక్ రషీదా 470 మార్కులకు 454 సాధించినట్లు వివరించారు.



వెనిగండ్లలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సత్కరిస్తున్న హెచ్‌ఎం తిరుపతిరావు

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

చేబ్రోలు: ఇంటర్ పరీక్షా ఫలితాల్లో చేబ్రోలు సూర్యదేవర నరసయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ సుచరిత శనివారం తెలిపారు. సీనియర్ ఇంటర్ ఫలితాల్లో 91శాతం ఫలితాలు సాధించారు. 47 మంది విద్యార్థులకు గాను 43 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీలో 20 మంది విద్యార్థులకు గాను 20 మంది ఉత్తీర్ణత సాధించారు. బైపీసీలో 10 మంది విద్యార్థులకు గాను 9 మంది, సీఈసీలో 14మందికి గాను 12 మంది, హెచ్‌ఈసీలో ముగ్గురుకు గాను ఇద్దరు ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీలో పీ నజ్మా 962 మార్కులు, బైపీసీలో జి. శ్యామల 920 మార్కులు సాధించారు.

జూనియర్ ఇంటర్ ఫలితాల్లో 91శాతం ఫలితాలు సాధించారు. 58 మంది విద్యార్థులకు గాను 53 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీలో 15 మంది విద్యార్థులకు గాను 13 మంది ఉత్తీర్ణత సాధించారు. బైపీసీలో 22 మంది విద్యార్థులకు గాను 21 మంది, సీఈసీలో 16 మందికి గాను 15 మంది, హెచ్‌ఈసీలో ఐదుగురుకు గాను నలుగురు ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీలో బి.లక్ష్మీ ప్రియ 440 మార్కులు, బైపీసీలో పి.ఇంతియాజ్ 420 మార్కులు అత్యధిక మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో శనివారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో చండీహోమం నిర్వహించారు. భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్భంగా విశ్వశాంతిని కాంక్షిస్తూ చేపట్టారు. బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ దంపతులతో తొమ్మిది మంది వేదపండితుల నిర్వహణలో గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, రుద్ర, లక్ష్మీగణపతి, చండీ హోమాలు నిర్వహించి పూర్ణాహుతి చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సిహెచ్ మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయ బాబు, సహాయ కార్యదర్శులు ఊటుకూరి నాగేశ్వర రావు, పుట్టగుంట ప్రభాకరరావు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్ చైర్లు అందజేత



నెహ్రూ నగర్: పేదలు, దివ్యాంగులను ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ పిలుపునిచ్చారు. మానవత పరిచర్య సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దు ప్రేమ్ జ్యోతిబాబు ఆధ్వర్యంలో నల్ల చెరువులో దివ్యాంగులకు వీల్ చైర్లు అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు తిప్పా బత్తిన గోవింద్, శరత్ బాబు, పాస్టర్ ఎం.శ్యాంసుందర రావు, ప్రభు మనోహర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

పొన్నూరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో రాజ్యాంగం– అంబేడ్కర్ అనే అంశంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. బీఎస్పీ, అంబేడ్కర్ యూత్ సంయుక్తంగా నిర్వహించిన ఈ పోటీలలో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. విజేతలకు ఈనెల 14 సాయంత్రం 6 గంటలకు జరిగే డాక్టర్ అంబేడ్కర్ జయంతి సభలో బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు ఎద్దు శామ్యూల్ రాజ్, యాతాటి కిషోర్ తెలిపారు.

కొనసాగుతున్న అంతర్జాతీయ కృపా మహాసభలు

గుంటూరు రూరల్: క్రీస్తుని రాకడ సమీపించుచున్నదని ఆయన భక్తులు ఆయన కోసం సిద్ధంగా ఉండాలని కృపా మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రదర్ మ్యాథ్యూస్ తెలిపారు. గత రెండు రోజులుగా నల్లపాడు రోడ్డులోని హౌసింగ్‌బోర్డ్ కాలనీ ఎదురుగా సుమారు వంద ఎకరాల విస్తీర్ణంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ కృపా మహాసభలు మూడోరోజు శనివారం కొనసాగాయి. మహాసభలను బ్రదర మ్యాథ్యూస్ ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రారంభించారు. మహాసభల నూతన పాటలను ఆలపించారు.

వైభవంగా వేణుగోపాల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు



పొన్నూరు: మండల పరిధిలోని కసుకర్రులోని వేణుగోపాల స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం ఆలయ వంశపారంపర్య అర్చకులు విజితేంద్ర, స్వామిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిత్యోపాసనం, గరుడోత్సవం, సాయంత్రం రథోత్సవం అంగరంగ వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కొండమూది నీటి సమస్యకు పరిష్కారం


సాక్షి ఎఫెక్ట్..

పొన్నూరు: మండలంలోని కొండమూదిలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించే విధంగా తగిన చర్యలు తీసుకున్నామని తెనాలి సబ్ డివిజన్ ఆర్ డబ్ల్యూఎస్ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అబ్దుల్ మతీన్ తెలిపారు. గ్రామంలో ఎస్ఎస్ ట్యాంకులో నీరు లేని కారణంగా ఏర్పడిన నీటి సమస్యను వివరిస్తూ శనివారం అడుగంటిన భూగర్భ జలాలు.. అల్లాడుతున్న జనం శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి ప్రకటన ద్వారా వివరణ ఇచ్చారు. ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నామని అన్నారు. నిబంధనల ప్రకారం రోజుకు ఐదు ట్యాంకర్ల నీటిని మాత్రమే అందిస్తున్నామని పేర్కొన్నారు. సరఫరా చేసిన నీరు సరిపోవడం లేదని అన్నారు. గ్రామంలో బోర్లు కూడా లేని కారణంగా నీటి కొరత ఏర్పడిందని త్వరితగతిన సమస్య పరిష్కారం దిశగా చర్యలు చేపడతామన్నారు. ఈ నెల 15వ తేదీన కేడబ్ల్యూడీ కాలువ నుంచి వచ్చే నీటిని ఎస్ఎస్ ట్యాంకులో నీటిని నిల్వ చేసే విధంగా పంచాయతీకి కఠినమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

నేడు ఆయుర్వేద వైద్య శిబిరం

గుంటూరు రూరల్: గోరంట్లలోని శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణుడు కొండా వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటలో తెలిపారు. పంచకర్మ, అనుభవం కలిగిన వైద్య బృందంతో పరీక్షలు నిర్వహించి మందులు అందజేయటం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.


భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి వేడుకలు



పెదకాకాని: భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. పెదకాకాని మండలంలోని ఆయా గ్రామాల్లో హనుమత్ జయంతి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయానే ఆలయాలకు చేరుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పెదకాకాని వై జంక్షన్‌లో ఉన్న అభయాంజనేయస్వామి దేవస్థానంలో ఆంజనేయ స్వామికి అభిషేకపూజలు, ఆకు పూజలు నిర్వహించారు. చందనంతో స్వామి వారిని అలంకరించారు. అర్చకులు భక్తులకు గోత్రనామ పూజలు చేసి ఆశీర్వచనము అందజేశారు. ఆలయానికి వచ్చిన భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

బైక్ చోరీలకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

పట్నంబజారు: ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. గుంటగ్రౌండ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్, కొత్తపేట ఎస్‌హెచ్‌ఓ ఎం.వీరయ్యచౌదరి వివరాలు వెల్లడించారు. పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం కోనూరు గ్రామానికి చెందిన కోట అఖిల్‌కుమార్ గుంటూరు నగరంలోని రైలుపేటలో గొలుసు నాంచారమ్మ హైస్కూలు వద్ద తన స్నేహితులతో కలసి రూము అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. అమెజాన్‌లో డెలివరీ బోయ్‌గా పనిచేస్తున్నాడు. సులభతరంగా సంపాదించాలని ఉద్దేశంతో చోరీలు చేయడం ప్రారంభించారు. పక్కా సమాచారం అందుకున్న పోలీసులు ఈనెల 11వ తేదీ రాత్రి రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే క్వార్టర్స్ ఎంట్రన్స్ వద్ద ఎస్ఐ డి.రమేష్, సిబ్బందితో వెళ్లగా నిందితుడు పరారయ్యేందుకు ప్రయత్నించాడు. అఖిల్‌ను పట్టుకుని తమదైన శైలిలో విచారించగా, ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్నట్లు అంగీకరించాడు. రూ.12 లక్షల విలువ చేసే 20 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. సుమారు పది కేసులు నిందితుడిపై నమోదు అయినట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన సిబ్బందిని అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ అబ్దుల్ అజీజ్, ఎస్‌హెచ్‌ఓ వీరయ్య, ముసుగులో నిందితుడు

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి



అంబటి మురళీకృష్ణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వేణు, పెదకాకాని మండల నాయకులు

పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: వైఎస్సార్ సీపీ అభివృద్ధే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని పార్టీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. బీసీ విభాగం గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా పెదకాకాని మండలానికి చెందిన తాడిబోయిన వేణుగోపాలరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ పార్టీ అభ్యున్నతి కోసం పని చేసిన ప్రతి కార్యకర్తకూ వైఎస్సార్ సీపీలో తప్పక గుర్తింపు ఉంటుందన్నారు. వేణుగోపాలరావు మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వుయ్యూరు సతీష్‌రెడ్డి, ఆలపాటి రాఘవరావు, దంతాల వెంకటేశ్వరరావు, బండ్లమూడి బాను, పెనుమాల అరుణ్, కుక్కల రాంప్రసాద్, నాగేశ్వరరావు, దానబోయిన నరసింహారావు పాల్గొన్నారు.

ఎరుకుల జాతి గుండెచప్పుడు ఏకలవ్యుడు



విగ్రహావిష్కరణ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

గుంటూరు రూరల్: గిరిజన సంస్కృతిలో ఆవిర్భవించిన గొప్ప త్యాగ పురుషుడు, పోరాటయోధుడు ఏకలవ్యుడు అని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు తెలిపారు. జై ఏకలవ్య అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో అమరావతి రోడ్డు నగరాలు ఐడీ హాస్పిటల్, రామచంద్ర బ్రదర్స్ ఫర్నిచర్స్ ఎదురు ఏకలవ్యుని విగ్రహావిష్కరణ ఉత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత గోరంట్ల సెంటర్ నుంచి అమరావతి రోడ్డు వరకు భారీ ద్విచక్ర వాహనాలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏకలవ్యుడు తాను నమ్మిన ద్రోణాచార్యుని మట్టి బొమ్మనే గురువుగా ఎంచుకొని ధర్మానికి కట్టుబడి త్యాగ పురుషుడిగా కీర్తి గడించాడన్నారు. పశ్చిమ శాసన సభ్యురాలు గళ్లా మాధవి మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎరుకల సమాజ సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు పెట్టి అమలు చేస్తుందన్నారు. తూర్పు ఎమ్మెల్యే షేక్ నజీర్‌అహ్మద్ మాట్లాడుతూ రాజకీయంగా గిరిజనుల ఎదుగుదలకు సంఘటితంగా వర్గాలకతీతంగా కలిసికట్టుగా నడవాలని కోరారు. శాసనమండలి సభ్యులు కుంభ రవిబాబు మాట్లాడుతూ గిరిజనుల రిజర్వేషన్లు ఆరు శాతం రాష్ట్రవ్యాప్తంగా కచ్చితంగా అన్ని స్థాయిలలో అమలు చేసేలా కృషి జరగాలన్నారు. సంఘం అధ్యక్షులు మేడ లక్ష్మయ్య మాట్లాడారు. విజయవాడ ఏఎస్పీ కుంభ కోటేశ్వరరావు, అభివృద్ధి సంఘం ఉపాధ్యక్షులు ఉయ్యాల వెంకటేశ్వర్లు, కార్యదర్శి తోకల పాపారావు, సహాయ కార్యదర్శి మేడ బ్రహ్మయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి తోకల రామకృష్ణ, కోశాధికారి కుంభ ఏడుకొండలు, గౌరవ అధ్యక్షులు మేడ హనుమంతరావు , ముఖ్య సలహాదారు, కుంభ వెంకటేశ్వరరావు, సలహాదారులు మేడ నాగేశ్వరరావు, కుంభ వెంకట్రావు, కుంభ సురేష్, కార్యవర్గ సభ్యులు, స్థానిక కార్పొరేటర్ నూకవరపు బాలాజీ, రాష్ట్ర ట్రైబల్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కుమార్ పాల్గొన్నారు.

డ్రెయిన్‌లో పూడికతీత పనులు వేగవంతం చేయాలి



రెడ్డిపాలెంలో డ్రెయిన్లను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు రూరల్: నగర పరిధిలో ప్రధాన డ్రెయిన్‌లో పూడికతీత పనులు వేగవంతం చేసి, వెంటనే పూర్తి చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. విద్యానగర్, నగరాలు, గోరంట్ల, రెడ్డిపాలెం తదితర ప్రాంతాలలో శనివారం పర్యటించారు. పారిశుద్ధ్య పనులు, ప్రధాన డ్రెయిన్లలో సిల్ట్ తొలగింపు పనులు, భవన నిర్మాణ అనుమతులు పరిశీలించి అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రధాన డ్రెయిన్లతో పాటు అంతర్గత రోడ్లలోని డ్రెయిన్లలోని పూడికతీత పనులు పక్కాగా నిర్వహించాలని కోరారు. వర్షాకాలం రాకముందే నగరంలోని ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్ల వెంబడి డ్రెయిన్లలో పూర్తి స్థాయిలో పూడికతీత పనులు పూర్తి చేయాలని చెప్పారు. పట్టణ ప్రణాళిక అధికారులతో సమన్వయం చేసుకొని, డ్రెయిన్లపై ఉన్న ర్యాంపులను తొలగించి నూరు శాతం పూడికతీత జరగాలన్నారు. పనులు చేపట్టకముందు, జరిగిన తరువాత ఫొటోలు, స్థానికుల సంతకాల వివరాలు అంచనాలతో పొందుపరచాలని సూచించారు. నగరంలో చెత్తకుప్పలు తొలగింపులో జాప్యంపై ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు వస్తున్నాయని, గత వారం నుంచి నైట్ శానిటేషన్ ద్వారా ప్రధాన రోడ్ల శుభ్రం పనులు ప్రారంభించామన్నారు. వార్డులలో ఉన్న చెత్తకుప్పలు కనపడకుండా ఎప్పటికప్పుడు తరలించాలని చెప్పారు. పర్యటనలో కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావు, ఏసీపీ రెహమాన్, ఎస్ఎస్‌లు సోమశేఖర్, ఐజాక్ పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ పరిశీలన

అన్న క్యాంటిన్‌లలో ప్రతిరోజు నిర్దేశిత సమయంలో ఆహారం అందించాలని నగర కమిషనర్ పి.శ్రీనివాసులు సిబ్బందికి సూచించారు. నగరంలోని బస్టాండ్ వద్ద నున్న అన్నా క్యాంటిన్‌ను పరిశీలించి ఆహారం తీసుకుంటున్న వారితో మాట్లాడారు. అన్నా క్యాంటిన్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి ఆహారం అందించాలన్నారు.

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరి



సంగీత కచేరి నిర్వహిస్తున్న వినయ్

నగరంపాలెం: నిరంతరం సంగీత కళాకారులను ప్రోత్సహిస్తూ, సంప్రదాయ సంగీతాన్ని భావితరాలకు అందించడం అభినందనీయమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శనివారం సాయంత్రం గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో శ్రీభక్త జ్ఞానానందతీర్థ (ఓగిరాల వీర రాఘవశర్మ) ఆరాధన సంగీత ఉత్సవం నిర్వహించారు. డాక్టర్ లలిత్‌ప్రకాష్‌చంద్ర, ఆలయ పాలక మండలి నిర్వాహకులు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. విద్వాన్ వినయ్ చేపట్టిన శాస్త్రీయ సంగీత కచేరి అలరించింది. వయోలిన్‌పై గాయత్రీ విభావరి (చెన్నై), మృదంగంపై బీరక సురేష్‌బాబు వాయిద్యాన్ని అందించారు. అనంతరం విద్వాన్ ఎస్.ఆర్.వినయ్ (బెంగళూరు)కి శ్రీభక్త జ్ఞానానంద తీర్థ మెమోరియల్ అవార్డుతో సత్కరించారు. కార్యక్రమంలో ఓగిరాల రామకృష్ణ, సంస్థ ప్రధాన కార్యదర్శి ఎం.వై.శేషురాణి, ఉపాధ్యక్షులు డాక్టర్ ఎం.రాజరాజేశ్వరి, మాధవపెద్ది మీనాక్షి, పాటిబండ లలితాదేవి, కార్యదర్శి ఏపీ మంగాదేవి, కోశాధికారి విజయలక్ష్మి పాల్గొనగా, కళాకారులను, అతిథులను సత్కరించారు.

వైభవంగా ప్రారంభమైన హనుమాన్ దీక్షలు

నగరంపాలెం: స్థానిక మారుతీనగర్‌లోని కంచి కామకోటి పీఠ శ్రీమారుతీ దేవాలయ ప్రాంగణంలో శనివారం చైత్ర శుద్ధ పౌర్ణమి సందర్భంగా వార్షికంగా నిర్వహిస్తున్న హనుమాన్ మండల వ్రత దీక్షలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆంజనేయస్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు, విశేష ఆకు పూజలు నిర్వహించారు. అనంతరం మండల దీక్షలు మాలధారణ చేశారు. భక్తులు విశేష సంఖ్యలో హాజరై, స్వామి అర్చనలలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి అర్థ మండల దీక్షలు ప్రారంభమవుతాయని, అదే నెల 25వ తేదీ వరకు మండల దీక్షలు నిర్వహిస్తామని కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ తెలిపారు.



మాలధారణ చేస్తున్న దృశ్యం

మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ



నెహ్రూ నగర్: యువత మత్తు పదార్థాలకు దూరంగా, వాటికి బానిస కాకుండా సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఈ మారయ్య బాబు పేర్కొన్నారు. శనివారం పొన్నూరు రోడ్డులోని హుస్సేన్ నగర్ ప్రాంతంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలను తాగడం ద్వారా విచక్షణ కోల్పోయి నేరాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. గంజాయి, మాదకద్రవ్యాల అమ్మకం, వినియోగాన్ని నిర్మూలించడానికి తీసుకోవాల్సిన నివారణ చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గుంటూరు గుంటూరు– 1 టౌన్ ఎక్సైజ్ స్టేషన్ బి.లత, ఎస్ఐలు షరీఫ్, తిరుమలేశ్వర రావు పాల్గొన్నారు.